క్లుప్తంగా

చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్ విడుదల

శాంతినగర్: అక్టోబర్ 4న జరిగే ఎస్సీ ఉప కులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఎస్సీ ఉప కులాల పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఆత్మగౌరవ సభ వాల్ పోస్టర్‌ను శాంతినగర్‌లో మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఉపకులాల ఉమ్మడి మహబూబ్‌నగర్ అధ్యక్షుడు నారకొండయ్య, కోశాధికారి కురువ తిక్కయ్య, ఉపాధ్యక్షుడు మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌రాజు, రంగన్న, పీకే సోమన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపు రైతులతో సమావేశం

అయిజ: రైతు రుణమాఫీకి సంబంధించి బుధవారం పట్టణంలోని రైతువేదికలో ఉదయం 11 గంటలకు వ్యవసాయ అధికారులు, బ్యాంక్ అధికారులు రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు రైతుసంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు హాజరుకావాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు కోరారు.

రేపు అవగాహన సదస్సు

గట్టు: ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యలపై బుధవారం మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పీఎఫ్ నోడల్ అధికారి రమేష్ చావా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గట్టులోని రైతు వేదికలో ఉదయం 10 గంటలకు పీఎఫ్ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చిన్నారులకు అన్నప్రాసన

గట్టు: పోషణ మాసంలో భాగంగా ఆలూరు 4వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ ఇందిర ఆధ్వర్యంలో గర్భిణులకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. పోషకాల గురించి టీచర్ ఇందిర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా లలిత, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రిజ్వానా తన్వీర్ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య మహిళా సమావేశంలో అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో 53 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, పుష్ప, మాబి, దేవమ్మ, పరిమళ, సంధ్య, రసీదు, అనూష, ప్రసన్న ఆశలు పాల్గొన్నారు.

పాగుంటలో మిషన్ భగీరథ

కేటీదొడ్డి: మండలంలోని పాగుంట ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ ఇంట్రా పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. రూ.5లక్షల వ్యయంతో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేశామని, తద్వారా 160 కుటుంబాలకు తాగు నీరు అందుతుందని ఆర్‌డబ్ల్యూస్ ఏఈ మల్లేష్ తెలిపారు. కాలనీకి మిషన్ భగీరథ నీళ్లు రావడం పట్ల కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

ధరూరు: ఇంట్లో ఉన్న వారిపై అకారణంగా దాడి చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కుర్వ రామాంజనేయులు ఇంటిపై అదే కాలనీకి చెందిన కుర్వ దర్శమ్ అతని తండ్రి పెద్ద బతుకన్న, మరో ఐదు మంది దాడికి పాల్పడ్డారు. గతంలో కుర్వ శ్రీనివాసులు పొలాన్ని దర్శమ్ కుటుంబం కొనాలనుకున్నారు. దర్శమ్ కంటే అధిక ధరకు రామాంజనేయులు పొలాన్ని కొనుగోలు చేశారు. తాము కొనాలనుకున్న పొలానికి అడ్డుగా వచ్చి అధిక రేటుకు కొన్నావంటూ సోమవారం రాత్రి అతనిపై దాడికి పాల్పడ్డారు. దాడికి పాల్పడిన ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అలంపూర్: జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన రాజు(35) అలంపూర్ చౌరస్తా నుంచి గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. అలంపూర్ చౌరస్తాలోని సర్వీస్ రోడ్డు నిర్మాణంలో వినియోగించే డస్టు కుప్పలుగా ఉండటంతో దాన్ని ఎక్కించి అతను రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలైన అతని 108లో అలంపూర్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

మద్యం పట్టివేత

అయిజ: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా మంగళవారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నలుగురు వ్యక్తులు కర్ణాటకలోని తల్మారిలో మద్యం సీసాలు కొనుగోలు చేసి నాలుగు బైక్‌లపై ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుండగా మండలంలోని పులికల్ సమీపంలో నాగలదిన్నె వంతెన వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేసి పట్టుకున్నారు. బైక్‌లు, మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని రాయచోటికి చెందిన బోయ రామాంజనేయులు, నందవరానికి చెందిన మల్లెపోగు ఏలీసా, బోయ బజారి, ఎమ్మిగనూరుకు చెందిన బోయ సత్యన్నపై కేసునమోదు చేసి గద్వాల ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. తనిఖీల్లో జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ పటేల్ బాలత్, జీడీ గోపాల్, ఎస్ఐలు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక ఐలమ్మ

- ఘనంగా ఐలమ్మ 128వ జయంతి
- గ్రామ గ్రామాన నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు


శాంతినగర్‌లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో నాయకులు, రజకులు

శాంతినగర్: సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో చాకలి ఐలమ్మ 128వ జయంతి వేడుకలను రజకులు, ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామాపురం చౌరస్తాలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ రజిత, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. బీజేపీ, ప్రజాసంఘాలు, రజకసంఘం నాయకులు ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.

అయిజ: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షహిదాబేగం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గట్టు: తహసీల్దార్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి అధికారులు ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో గిర్దావర్ శ్రీనివాసులు, గణాంక అధికారి శ్రీనివాసులు, కార్యదర్శి జగన్నాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ని వాళులు అర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. మండలంలోని బీరేల్లిలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ సరోజమ్మ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బీచుపల్లి, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దానయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, పరశురాముడు, మహేష్, మద్దిలేటి, రమేష్, రాముడు ఉన్నారు.

మానవపాడు: మండలకేంద్రంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు చోటా, అక్బర్, బీసీ నాయకులు పరమేష్, మంగలి నరసింహ, రాజు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎం.జి కృష్ణ, నాయకులు తిరుపాల్, మధు, బీసన్న, ఉపేందర్, రాముడు, వెంకటేష్ ఉన్నారు.


బీరెల్లిలో ఐలమ్మకు నివాళి..


రాజోళిలో..


గట్టులో..

బీఆర్ఎస్‌లో చేరికలు


పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో కేటీదొడ్డి మండలం పూజారితండాకు చెందిన బీజేపీ మండల అధ్యక్షురాలు కమలమ్మతో పాటు పలువురు పార్టీలో చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గద్వాల మండలం కాకులారం గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. పేదలకు త్వరలోనే ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, నర్సింహులు, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

దేశంలోనే సీఎం కేసీఆర్ రోల్ మోడల్



ఉండవెల్లి: దేశంలోనే కేసీఆర్ రోల్‌మోడల్‌గా నిలిచాడని ఎమ్మెల్యే డా. వీఎం అబ్రహం అన్నారు. మంగళవారం మండలంలోని ఇటిక్యాలపాడులో రూ.38 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లోకేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దేవన్న, ఎంపీటీసీ సుంకన్న, నాయకులు రమేష్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు న్యాయం చేయాలి


శాంతినగర్‌లో సమ్మె చేస్తున్న ఆశా కార్యకర్తలు

శాంతినగర్: ఆశా వర్కర్లకు తెలంగాణ ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. వడ్డేపల్లి పట్టణంలోని శాంతినగర్ ఐకేపీ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వం హామీ ఇచ్చేంత వరకు న్యాయ పోరాటం చేస్తామని ఆశా కార్యకర్తలు పేర్కొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటరావుకు ఆశా కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్దకల్: ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని సంఘం సభ్యులు కాంతమ్మ, సుజాతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల తహసీల్దార్ కార్యాయంలో ఎదుట నిరవధిక సమ్మె 2వ రోజుకు చేరింది. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు కేశమ్మ, కృష్ణవేణి, సుజాత, నర్సమ్మ, శంకరమ్మ, భారతమ్మ పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

శాంతినగర్: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో ఉన్న బాధిత కుటుంబానికి చికిత్స కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2.50లక్షల ఎల్ఓసీని ఎమ్మెల్యే అబ్రహం మంగళవారం అందజేశారు. వడ్డేపల్లి మండలం జిల్లెడుదిన్నెకు చెందిన టీ ఎల్లప్ప సతీమణి టీ లక్ష్మీదేవమ్మ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వారు సీఎం సహాయ నిధికోసం దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాశపోగు రాజు, ఎంపీపీ రజిత, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, మహేష్‌లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్ర అందజేస్తున్న అంగన్‌వాడీలు

గద్వాల అర్బన్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె 16వ రోజుకు చేరింది. మంగళవారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ప్రమాద, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నర్మద, ఫరిద, అరుణ, జ్యోతి, శిరీష, ఈశ్వరమ్మ, శాంతమ్మ, పుష్ప, సుమలత ఉన్నారు.

అలంపూర్: అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారానికి దారి చూపాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సంఘం జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ. 26 వేల వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బల్గెరకు బస్సు ఏర్పాటుపై హర్షం



గట్టు: విద్యార్థుల సౌకర్యార్థం బల్గెర నుంచి అయిజకు బస్సును ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బల్గెర నుంచి అయిజకు గద్వాల ఆర్టీసీ అధికారులు బస్సును ఏర్పాటు చేశారు. మాచర్ల, బల్గెర, మిట్టదొడ్డి, తుమ్మలపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు అయిజ కాలేజీకి వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తీన్మార్ మల్లన్న టీం జిల్లా కో కన్వీనర్ కొమ్ముల ప్రవీణ్‌రాజ్ గద్వాల ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. బల్గెర, మిట్ట దొడ్డి, తుమ్మలపల్లి విద్యార్థులకు అనుగుణంగా బస్సును బల్గెర నుంచి అయిజకు ఏర్పాటు చేయడంపై తీన్మార్ మల్లన్న టీంతో పాటుగా బల్గెర గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎఫ్ఎస్‌టీపీపై విద్యార్థులకు అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు

అయిజ: మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆదేశాల మేరకు ఎఫ్ఎస్‌టీపీ, డంపింగ్ యార్డ్‌పై మున్సిపల్ సిబ్బంది వివిధ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్దీపురం ఆవరణలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీపీ, డంపింగ్ యార్డ్‌లను శ్రీ చైతన్య హైస్కూల్, జీవీఆర్ఎం పాఠశాల విద్యార్థులకు చూపించారు. అవి పనిచేసే విధానం, వాటి వల్ల ఉపయోగాలు విద్యార్థులకు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్‌వార్డ్ ఆఫీసర్లు భరత్, పరశురాముడు, గిరిమోహన్‌రెడ్డి, యశోద, శశికళ, బీసమ్మ, ఇన్విరాన్మెంటల్ ఇంజినీర్ సురేష్, బిల్ కలెక్టర్ నరేష్, మహేంద్రనాథ్, అడివన్న, ఆంజనేయులు, వీరేష్, ప్రకాష్, రాకేష్, ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం వద్ద బారులు

గట్టు: ఆధార్ కేంద్రం వద్ద ప్రజలు బారులు తీరారు. మంగళవారం మండల కేంద్రంలోని నేతాజీ సర్కిల్‌లో ఆధార్ కేంద్రం దగ్గర వివిధ గ్రామాల వారు పెద్ద ఎత్తున రావడంలో ఆధార్ కేంద్రం కిటకిటలాడింది. రేషన్ కార్డుల వారు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించడంతో వారు ఆధార్ నమోదు కేంద్రానికి తరలొచ్చారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు


జల్లాపురంలో పూజలు చేస్తున్న యువకులు

గద్వాల: జిల్లా కేంద్రంలో కొలువుదీరిన గణేష్ మండపాలలో నిత్యం పూజలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం పట్టణం, గ్రామాలలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి జ్యోతి గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని 23, 36వ వార్డులలో గణేష్ మండపాల వద్ద బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పూజలు చేశారు.

అలంపూర్ రూరల్: అలంపూర్‌పట్టణంలో క్రాంతి యువజన సంఘం, ఆర్యవైశ్య సంఘం, అక్బర్ పేట, వడ్లచారివీధి, పాత బస్టాండ్, చేనేత కాలని, న్యూప్లాట్స్, అంబేద్కర్ కాలనీలలో వినాయకుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

అన్నదానం

మానవపాడు: మండలంలోని జల్లాపురం, బోరవెల్లి, పల్లెపాడు, కలుకుంట్ల గ్రామాల్లో వినాయక విగ్రహాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

డీసీఎంను ఢీకొట్టిన లారీ

మానవపాడు: జాతీయ రహదారి -44పై పైప్‌ల లోడ్‌తో ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుంచి మరో లారీ ఢీ కొట్టిన ఘటన బోరవెల్లి స్టేజీ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి బెంగుళూరు వైపు పైప్‌ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎంను బోరవెల్లి స్టేజీ సమీపంలో వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. డీసీఎం బోల్తా పడడంతో డ్రైవర్ నరేంద్రకు గాయాలయ్యాయి. ఆయనను వెంటనే అలంపూర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో జెడ్పీచైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: పట్టణంలోని జమ్మిచేడుకు చెందిన రామన్‌గౌడ్, జయరాములు గౌడ్, కార్తీక్ గౌడ్, భీమన్ గౌడ్‌లతో పాటు మరో 30మంది గౌడ సంఘం సభ్యులు, మండలంలోని సంగాల గ్రామానికి చెందిన వారు మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాయలంలో పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్ గౌడ్, నాగరాజు, తిమోతి, వెంకటన్న, ఆంజనేయులు ఉన్నారు.

వినాయకుడికి జెడ్పీ చైర్ పర్సన్ పూజలు

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని గణనాథులకు జెడ్పీ చైర్ పర్సన్ సరిత పూజలు చేశారు. అనంతరం గణపయ్యలను నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో సింగల్‌విండో డైరెక్టర్ సురేష్, నాయకులు శ్రీనివాస్‌గౌడు, శేషాద్రి, వీరన్న పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని ఉప్పేరులో ఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి జెడ్పీ చైర్ పర్సన్ సరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ గౌడ్, ఆనంద్‌రెడ్డి, రవి, బాలు పాల్గొన్నారు.

బ్యాంకులతో సత్సంబంధాలు ఉండాలి


అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

రాజోళి: బ్యాంకులతో ప్రజలకు సత్సంబంధాలు కలిగి ఉండాలని ఆర్థిక అక్షరాస్యత ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ వారు మండలంలోని మాన్‌దొడ్డిలో కళాజాత నిర్వహించారు. మంగళవారం గ్రామంలోని వికాస్ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ప్రజలకు పలు విషయాలు తెలిపారు. క్రాప్ రుణాలు, పొదుపు సంఘాల రుణాలు, ప్రభుత్వ పథకాలను బ్యాంకుల ద్వారా ఎలా వినియోగించుకోవాలి, సైబర్ మోసాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది రాజేష్, హనుమంతు నాయుడు, కళాజాత బృందం సభ్యులు తేజకుమార్, రాఘవేంద్ర ఉన్నారు.

పోటీలు సృజనాత్మకతను వెలికి తీస్తాయి


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ నవీన మంజులత

గద్వాల: విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత, కళా ప్రతిభను ప్రోత్సహించడానికి పోటీలు ఎంతో దోహదం చేస్తాయని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నవీన మంజులత, రాష్ట్రీయ కళామంచ్ ప్రాంత ప్రముఖ్ కరుణాకర్‌లు పేర్కొన్నారు. రాష్ట్రీయ కళామంచ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినీలకు మెహిందీ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పద్మ, వెంకటేశ్వరమ్మ, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్, రాష్ట్రీయ కళామంచ్ జిల్లా కన్వీనర్ వెంకటేష్ పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్టన్న

గద్వాల అర్బన్: మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్టన్న డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడారు. కార్మికులకు జీతాలు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రాజేష్, నర్సింహ, శ్రీనివాసులు, మౌలాలి, రవి, రాము ఉన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లను తరలించొద్దు

అలంపూర్: నియోజకవర్గ కేంద్రమైన అలంపూర్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టళ్లను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని వివేకానంద యూత్ సభ్యులు కోరారు. అలంపూర్ పట్టణంలో టూరిజం హోటల్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ జీఓ ఇచ్చిన విషయం తెలియదని సంబంధిత అధికారులతో మాట్లాడి హాస్టళ్లు ఇక్కడే ఉండేవిధంగా ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంజీవ నాయుడు, బుజ్జి యాదవ్, రజనీబాబు, రవి, శీను, ప్రశాంత్ మల్లికార్జున్ ఉన్నారు.

ఆశా కార్యకర్తల వినతి

ఆశా కార్యకర్తల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ, ఆశా కార్యకర్తలు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని కోరారు. ఆలయాల దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్సీని శిబిరం వద్దనే కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు నాగేశ్వరమ్మ,కృష్ణవేణి, అంజనమ్మ, భారతి, పద్మ ప్రమీల, శ్రీదేవి, నాగలచ్చమ్మ, పద్మావతి, శివలీల, చిట్టెమ్మ, విజయమ్మ ఉన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసలు

అయిజ: పట్టణంలోని బ్రైట్ స్టార్ పాఠశాలలో మంగళవారం మిరాకిల్ మిల్లెట్స్ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శనలో ప్రతిభ కనబరచడంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేర మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో సోమవారం నిర్వహించిన నేషనల్ సైన్స్ ఫెస్టివల్ 2023 జిల్లా స్థాయి డ్రామా కాంపిటీషన్‌లో విద్యార్థులు మిరాకిల్ మిల్లెట్స్ అనే డ్రామా ప్రదర్శనలో పాల్గొన్నారని తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుల ఇళ్ల నుంచి మట్టి సేకరణ

అయిజ: మేరా మట్టి – మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని స్వాతంత్ర్య సమరయోధుల ఇండ్లనుంచి పోస్టల్ సూపరింటెండెంట్ ఎంఏ అలీమ్ పోస్టల్ ఉద్యోగులతో కలిసి మంగళవారం మట్టిని సేకరించారు. అయిజలో రజాకారులతో స్వాతంత్ర్య పోరాటంలో పోరాడి అమరులైన బలిజ గాండ్ల నాగప్ప, మేకల చిన్న తిమ్మప్ప, పాగుంట వెంకటయ్య, మాల చిన్న నాగన్న గృహాలను సందర్శించి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో గద్వాల సబ్ డివిజన్ ఏఎస్పీ అజయ్ సింగ్ చౌహాన్, డివిజన్ ఆఫీస్ ఐపీసీ వీకే సింగ్, డివిజన్ ఆఫీస్ ఓఏ నారాయణగౌడ్, అయిజ పోస్ట్ మాస్టర్ సూర్యనారాయణ, పోస్టాఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోటో (26 ఎఎల్‌పి 306: అయిజలో మట్టిని సేకరిస్తున్న అధికారులు

హామీ ఇవ్వకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం

అలంపూర్ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల రుణమాఫీ పథకం రైతుల ఖాతాలో జమ కావడం లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న అన్నారు. మండలంలోని లింగన్‌వాయి రైతువేదిక భవనం దగ్గర రైతులతో కలిసి మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులను అయోమయానికి గురి చేస్తోందని అన్నారు. రుణమాఫీ చేయని ఎడల కలెక్టరేట్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జయరాముడు, ఆంజనేయులు, వేమారెడ్డి, ఈశ్వరయ్య, మహేష్, గౌస్‌పీరా, వెంకటేశ్వర్లు, చిన్న మద్దిలేటి, కృష్ణ, రామేశ్వర్ రెడ్డి ఉన్నారు.

విద్యుత్ దీపాలు బిగించిన సర్పంచ్



కేటీదొడ్డి: మండలంలో పాతపాలెం సర్పంచ్ సూర్యప్రకాష్ మంగళవారం స్వయంగా విద్యుత్ స్తంభాలు ఎక్కి దీపాలను బిగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు.